క్లుప్తంగా

ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా ప్రేమానందం

మాకవరపాలెం : ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా ప్రేమానందం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఏఈ రమణ ఇటీవల పదవీవిరమణ చేశారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం ఏఈ ప్రేమానందంకు మాకవరపాలెం ఏఈగా ఇన్‌చార్జ్‌గా నియమించడంతో శనివారం ఆయన విధుల్లో చేరారు.

నేడు తలుపులమ్మ అమ్మవారి పండగ

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామదేవత తలుపులమ్మ అమ్మవారి పండగను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాన్ని విద్యుద్దీపాలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

113 మందికి ఆరోగ్య పరీక్షలు

కె.కోటపాడు : సూదివలస గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను శనివారం నిర్వహించారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్‌వీ భాగ్యలక్ష్మి 113 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని భాగ్యలక్ష్మి సూచించారు. ప్రసవాలు ప్రభుత్వాసుపత్రుల్లోనే నిర్వహించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషాశ్రీ

నాతవరం : మండలంలో ఈనెల 5వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో ఉషాశ్రీ అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన నాతవరం సచివాలయం-1, 6న నాతవరం సచివాలయం-2, 7న చమ్మచింత, 8న గుమ్మడిగొండ, 12న గునుపూడి, 13న గన్నవరం, 14న పీకే గూడెం, 15న వల్సంపేటలో గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కేంద్రాల్లో ఆధార్ కార్డుల్లో పేర్ల నమోదు, సవరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు ముందుగా గ్రామాల్లో దండోరా ద్వారా తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆధార్ కేంద్రాల నిర్వాహకులపై స్థానికులు నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

అంబేడ్కర్ నాటకాన్ని జయప్రదం చేయండి

నర్సీపట్నం: ఈ నెల 14న నర్సీపట్నం సిటీక్లబ్ అవరణలో ప్రదర్శిస్తున్న సంఘం శరణం గచ్ఛామి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నాటకాన్ని విజయవంతం చేయాలని యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చిట్టియ్య పిలుపునిచ్చారు. సీఐటీయు కార్యాలయంలో నాటక ప్రదర్శన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు మే నెలాఖరు వరకు ఉంటాయన్నారు. దీనిలో భాగంగానే నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. నేటి సమాజానికి ఈ తరానికి అంబేడ్కర్ దేశం కోసం చేసిన త్యాగం, అణగారిన వారి కోసం చేసిన త్యాగం నాటక రూపంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కేవీపీఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, అంబేడ్కర్ మిషన్ సంఘం నాయకులు మల్లేష్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు.


ఎంతో విలువైన ధారమఠం శివాలయం భూములు
లింగంపేట నూకాలమ్మతల్లి భూములు (ఇన్‌సెట్) భూములుఆక్రమించకుండా దేవదాయశాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

అక్కరకు రాని ఆలయ భూములు

- గిట్టుబాటు కాని శిస్తులు
- కౌలుకు ముందుకు రాని రైతులు
- కష్టతరంగా ఆలయాల నిర్వహణ
- ధూపదీప నైవేద్యాలు లేక దయనీయం
- పండగల నిర్వహణకూ పాట్లు

గొలుగొండ : లింగంపేట, ధారమఠం శివాలయాలకు ఎంతో విలువైన భూములు ఉన్నా ఆదాయం లేకుండా పోతుంది. గత నాలుగు సంవత్సరాల నుంచి భూములకు వేలం వేస్తున్నా రైతులు సాగు చేయడం కోసం శిస్తులు కట్టడానికి ముందుకు రాలేదు. దీని వల్ల ఎంతో విలువైన భూములు ఉన్నా ఆదాయం లేకుండా పోతుంది. దీని వల్ల ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. లింగంపేట నూకాలమ్మతల్లికి సుమారుగా 35 ఎకరాల భూములు ఉండగా, ధారమఠం శివాలయానికి 24 ఎకరాల భూములు ఉన్నా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. రైతులు ముందుకు రాకపోవడం వల్లనే ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నట్లు ఆలయ అధికారులు తెలుపుతున్నారు.

ఆదాయం అంతంతమాత్రమే

ప్రతి ఏటా ఆలయ భూములతో వచ్చిన ఆదాయంతో ఆలయాల నిర్వహణ పూర్తి స్థాయిలో జరిగేది. లింగంపేట నూకాలమ్మతల్లి ఉన్న భూములపై సుమారుగా రూ.మూడు లక్షల వరకు ఆదాయం రావాల్సి ఉంది. కానీ ఇక్కడ కనీసం లక్ష వరకు కూడా ఆదాయం రావడం లేదు. వేలం నిర్వహించే సమయంలో రైతులు ముందుకు రావడం లేదు. వీటిపై వచ్చిన ఆదాయంలో కొత్త అమావాస్యకు వారం రోజుల పాటు పండగలు నిర్వహించడం జరుగుతుంది. అలాగే పూజారికి, ధూప దీప నైవేద్యాలు కూడా కష్టతరంగా మారింది.

ధారమఠం శివాలయానికి 24 ఎకరాల విలువైన నీటి సౌకర్యం ఉన్న భూములు ఉన్నాయి. ఇక్కడ వచ్చిన ఆదాయంతో మహాశివరాత్రి మూడు రోజుల పండగలు ఎంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. నీటి సౌకర్యం ఉన్నా శిస్తులు గిట్టుబాటు లేక రైతులు వేలం పాటకు రావడం లేదు.

ఇప్పటికే రెండుసార్లు వేలం

ఆలయ భూములు శిస్తులకు ఇవ్వడం కోసం అధికారులు ఇప్పటికే రెండుసార్లు వేలం నిర్వహించారు. ధారమఠం శివాలయం భూములకు సంబంధించి 5 ఎకరాల భూమి మాత్రం ఇటీవల రెండో వేలంలో రూ.56 వేలకు జోగుంపేటకు చెందిన రైతు పాడుకున్నారు. మిగతా భూములు ఖాళీగానే ఉన్నాయి,

ఖరీఫ్ పనులు ప్రారంభం

గడిచిన 10 రోజుల నుంచి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ వచ్చే నెల నుంచి ప్రారంభం కావడం జరుగుతుంది. ఇప్పటికే కనీసం 10 శాతం భూములు శిస్తులకు వెళ్లలేదు. ఖరీఫ్ ప్రారంభం అయితే రైతులు అసలు శిస్తులకు చేయడం కోసం ఎవరూ ముందుకు రారు. ఆదాయం లేకపోవడం వల్ల పండగలు సరిగ్గా చేయకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. పంటలకు భూములు శిస్తులకు చేసినా ప్రస్తుతం కూలి రేట్లు ఎక్కువగా ఉండడం వల్ల గిట్టుబాటు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ధూపదీప నైవేద్యాదులుతో పాటు పండగల నిర్వహణలో ఇబ్బందులు వస్తున్నాయి. అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పాటు చేసి భూములు శిస్తులకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

> **13న మళ్లీ శిస్తులకు వేలం**
>
> ఈనెల 13న లింగంపేట, ధారమఠం భూములు శిస్తులకు ఇవ్వడానికి వేలం నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటికే ఆలయ అధికారులతో భూములు ఉన్న పక్క గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ దండోరా వేయించడం జరిగింది. ఖరీఫ్ ప్రారంభం అవుతున్న కారణంతా ఈ సారి భూములు శిస్తులకు ఇవ్వడం కోసం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. శిస్తుల వల్ల వచ్చే ఆదాయంతోనే ఆలయాల నిర్వహణ జరగాల్సి ఉంది.
>
> – దివ్యతేజ, లింగంపేట, ధారమఠం ఆలయాల ఈవో

ఎల్‌బీ పురంలో కలెక్టర్ పర్యటన


ఎల్‌బీ పురంలో నీటి కుండీల వద్ద ఆవుకు నీటిని తాగిస్తున్న కలెక్టర్

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఎల్‌బీ పురంలో గ్రామంలో కలెక్టర్ విజయ క్రిష్ణన్ పర్యటించారు. శనివారం గ్రీవెన్స్‌లో భాగంగా ఆమె ఎల్‌బీ పురంలో అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో ఇంటింటి కుళాయి పనులను, కొత్తగా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులను ఆమె పరిశీలించారు. పాత మంచినీటి ట్యాంకు క్లోరినేషన్ ప్రతి రోజూ చేయాలని పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డికి సూచించారు. చెరువులోకి వెళ్లి ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజు కూలీ రూ.300 కూడా రావడం లేదని పలువురు కూలీలు కలెక్టర్‌కు తెలపగా ప్రభుత్వ కొలతల ప్రకారం పనులు చేయించకపోవడంపై అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో కొత్తగా కట్టిన పశువుల నీటి కుండీని కలెక్టర్ నాయకులు,అధికారులతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ స్వయంగా ఆవులకు నీళ్లు తాగించారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

బుచ్చెయ్యపేట ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులు, ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో వెనకబాటుపై తహసీల్దార్ లక్ష్మిపై కలెక్టర్ ఆగ్రహం చెందారు. గ్రామాల్లో పారిశుధ్యంపై మండల పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మిపైన, జాతీయ ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా జరిపించకపోవడంపై ఏపీవో వరహాలబాబుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ మెల్లి శ్రీను, మాజీ సర్పంచ్ దాసు,ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం


మామిడిపల్లిలో పారిశుధ్య పనులు చేపడుతున్న జెడ్పీటీసీ సత్యం, ప్రత్యేక అధికారి మంజులవాణి

దేవరాపల్లి : సమష్టి బాధ్యతగా పారిశుధ్యం మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి అన్నారు. మామిడిపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల స్థాయి అధికారులు పర్యటించారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తదితర అధికారులతో పాటు జెడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, స్థానిక పశువైద్యశాలలో తుప్పలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. వీరంతా పార చేత పట్టి ఆస్పత్రి పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం స్థానిక సచివాలయంలో గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. పీ-4 సర్వేలో గుర్తించిన నిరుపేదలను గ్రామ పెద్దలు అధికారుల సమక్షంలో దత్తత తీసుకున్నారు. ఇంటింటా రేషన్ సరుకులు సరఫరా చేస్తున్న వాహనం వద్ద చేరుకొని రేషన్ పంపిణీ తీరును, ఈకేవైసీ ఎంత మేర పూర్తయ్యింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, హౌసింగ్ ఇంచార్జ్ ఏఈ ఎస్.భవ్యతేజ, ఇంచార్జ్ ఈవోపీఆర్డి జామి అప్పారావు, స్థానిక పశువైద్యాధికారి జి.ప్రియాంక, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ సెక్రటరీ శివ పాల్గొన్నారు.

‘అన్నదాన సత్రంపై ఫిర్యాదు చేయలేదు..’

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం జంక్షన్లో రోడ్డు విస్తరణలో భాగంగా, కాలువలు నిర్మించాలని తాము ఫిర్యాదు చేశాం కానీ సంతోషిమాత ఆలయం అన్నదాన సత్రం తొలగించమని తాము ఫిర్యాదు చేయలేదని స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రోడ్డు నిర్మాణంలో భాగంగా, కె.జె.పురం జంక్షన్‌లో గల నివాస గృహాలు వాడుక నీరు, మురుగునీరు పోవుటకు డ్రైనేజ్ కాలువ నిర్మించాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రహదారి దగ్గర్లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఉప దేవాలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉందని, ఈ రహదారిలో బస్సులు, లారీలు ఎదురెదురుగా వచ్చేటప్పుడు ఆటోలు చిన్న వాహనాల్లో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రహదారిలో 3-0 నుంచి 3-4 వరకు సుమారు 400 మీటర్లు రోడ్డుకిరువైపులా ప్రభుత్వ స్థలం (ఆర్ అండ్‌బీ) ఉన్నంత వరకు మార్కింగ్ చేసి, ప్రజా ప్రయోజనాలు దృష్ట్యా అడ్డంగా ఉన్న వాటిని తొలగించి, డ్రైనేజి నిర్మించడానికి ఆర్‌అండ్‌బీ వారికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఈ ఏడాది మార్చి 10 వ తేదీన తనతో పాటు జంక్షన్‌లో నివసిస్తున్న వారు విజ్ఞప్తి చేశారని తెలిపారు. తాము అన్నదాన సత్రం కానీ, సంతోషిమాత ఆలయం కానీ తొలగించాలని ఫిర్యాదు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు.

బుచ్చెయ్యపేటలో దంచి కొట్టిన వర్షం


బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న భారీ వర్షం


బుచ్చెయ్యపేట మండలం నీలకంఠాపురం పొలాల్లో చేరిన వర్షపు నీరు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల నుండి వర్షం కురవడం ప్రారంభించింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కాసింది. అప్పటి వరకు తీవ్ర ఎండ,ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఉరుములు,మెరుపులు, పిడుగులతో భారీ గాలీ వర్షం కురిసింది. గంటకుపైగా గాలి వర్షం కురవడంతో పలు గ్రామాల్లో పంట పొలాల్లో వర్షం నీరు చేరింది. రోడ్లపైన,లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు ప్రవహించడంతో మండు వేసవిలోను వర్షాకాలం తలపించింది. వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగింది. పలు గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. వర్షంతో మండల ప్రజలు వడగాడ్పుల నుంచి ఉపశమనం పొందారు.

మాడుగుల: మాడుగులలో శనివారం ఈదురు గాలులలో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో చెట్లు కొమ్మలు విరిగిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. గత నాలుగు రోజులు నుండి ప్రతి రోజు సాయంకాలం వర్షం కురవడంతో వేసిన మినుము, పెసలు మొలకలు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లా స్థాయి సమావేశం విజయవంతం చేయండి


సమావేశమైన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: అనకాపల్లి రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు జరిగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలిని రావికమతం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు,పార్టీ కన్వీనర్ కంచిపాటి జగ్గారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలో గల వైఎస్సార్సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు,అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు,యూత్ కమిటీ సభ్యులు,పార్టీ ముఖ్య నాయకులు,పెద్ద ఎత్తున కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

గర్నికం కేజీబీవీలో మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం


స్పెషల్ ఆఫీసర్ భాను

రావికమతం: మండలంలో గర్నికం కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ లో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని స్పెషల్ ఆఫీసర్ భాను తెలిపారు. ఆసక్తి కలిగిన మొదటి సంవత్సరం డ్రాప్ అవుట్ విద్యార్థినులు కళాశాల పని దినాలలో నేరుగా తనను సంప్రదించాలని చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి సహకరించండి

రోలుగుంట : స్థానిక కొండపైన వెలసిన వేంకటేశ్వర ఆలయం అవరణలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, ధ్వజస్తంభం ఏర్పాటుకు ఆలయకమిటీ నిర్ణయించిందని ప్రధాన అర్చకుడు రేజేటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు భక్తుల నుంచి విరాళాల సేకరణ చేపట్టినట్టు శనివారం విలేకరులకు తెలిపారు. శనివారం నుంచి భక్తుల సాయం కోసం గ్రామాల్లో తిరుగుతున్న తమ వాహనం వద్దకు భక్తులు వచ్చి తమకు తోచిన సాయమందించి దైవ కార్యాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మత్స్యాల సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

బొమ్మలు గీయటంలో విద్యార్థులకు తర్ఫీదు


వేసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

నర్సీపట్నం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు బొమ్మలు గీయడంపై తర్ఫీదు ఇచ్చారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రవికుమార్ బొమ్మలకు ఏవిధంగా రంగులు వేయాలో వేసి చూపించి, విద్యార్థులతో వేయించారు. డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థి కృష్ణవేణి స్పోకెన్ ఇంగ్లిష్‌లో పదాలు ఎన్ని రకాలు, వాటిని ఎలా ఉపయోగించాలో వివరించారు. క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు.

రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా కందిగెడ్డ వంతెన


రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెన ప్రాంతం

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం-కొరువాడ జగన్నాథపురం గ్రామాల మధ్య గల కందిగెడ్డపై గల వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ వంతెన నిర్మాణం జరిగి సుమారు 24 ఏళ్లు అయ్యింది. నాటి నుండి నేటికి వంతెనకు రెండు వైపులా రక్షణగోడల నిర్మాణం జరగలేదు. ఈ వంతెన మార్గం గుండానే కె.కోటపాడు మండల గ్రామాల్లో గల ప్రజలు విజయనగరం, కొత్తవలస ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అధిక సంఖ్యలో వాహనాలపై ప్రయాణాలను చేస్తుంటారు. ఈ వంతెన ప్రాంతం మలుపు వద్ద ఉండడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేక వంతెన పై భాగంలో ప్రయాణించే సమయంలో రక్షణ గోడలు లేని ప్రాంతాల వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రక్షణ గోడలు లేని కందిగెడ్డ వంతెనను పరిశీలించి, త్వరితగతిన నిర్మాణం జరపాలని వాహనదారులు కోరుతున్నారు.

పెదపేట గ్రామంలో తాగునీటికి ఇక్కట్లు


కుళాయి వద్ద బిందెలతో నీటి కోసం..

రోలుగుంట: మండలం ఎంకే పట్నం శివారు పెదపేట గ్రామస్తులు తాగునీటి కోసం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సమస్య అధికారులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని ఆరోపిస్తున్నారు. ఈ గ్రామంలో 50 కుటుంబాలు 150 మంది పైబడిన జనాభా ఉన్నారు. ఇక్కడి కుళాయిల నుంచి కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా జరగక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కుళాయిల వద్ద బిందెలు పెట్టి తాగునీరు ఎప్పుడు సరఫరా అవుతుందోనని ఎదురు చూసే పరిస్థితితులు కొద్ది రోజులుగా నెలకొన్నాయని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

మాడుగుల : స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం 26 వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. మందిరాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేసిన మేలుకు.. మసిపూసే ప్రయత్నం

- గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాల కుదింపునకు కుట్ర
- చాపకింద నీరులా చర్యలు
- గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు
- పట్టణ, మండల పరిధిలో 56 సచివాలయాలు
- వాటిని 30కి తగ్గించేందుకు కసరత్తు


వెంకుపాలెంలోని సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం

అనకాపల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. కూటమి పాలనలో ఏడాది నుంచి ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదు. గ్రామ, వార్డు సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. వాటి సంఖ్యను కుదించాలని చూస్తోంది. దీనిపై పట్టణ, గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరలా మండల కార్యాలయాల చుట్టూ గ్రామీణ ప్రజలు ప్రదక్షిణలు చేయాలని ఆందోళనకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణ, మండలంలో 53 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు అందిస్తే, వాటిని కుదించేందుకు కూటమి ప్రభుత్వం చాపకింద నీరులా పావులు కదుపుతోంది. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వ సేవలకు దూరమయ్యే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని అంతా భయపడుతున్నారు. 53 సచివాలయాలకు 30 సచివాలయాలు ఉండే విధంగా ఇప్పటికే అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎక్కడి సచివాలయాలు తొలగిస్తారో అర్థం కావడం లేదు. తొలగించే సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వారి పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ఆందోళనలో పడ్డారు. నాలుగు నుంచి ఐదు గ్రామాల ప్రజలకు ఒకేచోట సేవలు అందించనున్నారు. జనాభాను దృష్టిలో పెట్టుకుని సచివాలయాలను కుదిస్తున్నారు. ఇదే విధానం ఆర్బీకేలకు వర్తించనున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చూపించకుండా ఉన్న ఉద్యోగాలను దశల వారీగా తొలగించేందుకు చర్యలు చేపట్టడం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇంటి ముంగిటకు వచ్చే వలంటీర్ల ఉద్యోగాలు తొలగించారు.

రైతు సేవా కేంద్రాలు...

వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుసేవా కేంద్రాలుగా వాటి పేరు మార్పు చేశారు. ఆ తర్వాత వాటి ప్రాధాన్యతను క్రమేణా తగ్గించే కుట్ర చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కియోస్క్‌లను ఏర్పాటు చేసింది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు, పశువులకు దాణా, పంటల మార్కెటింగ్ తదితర సేవలు అందించేందుకు ఈ విధానం ఉపయోగపడేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ సర్వర్లు సక్రమంగా పని చేయకపోవడంతో వాటి సేవలకు మంగళం పలికారు.

సర్వేలో సచివాలయ ఉద్యోగులు..

200కు పైగా సేవలు అందించే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 30 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయలేదు. వలంటీర్లను తొలగించి వారు చేస్తున్న పనులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. అంతటితో ఆగకుండా 30కి పైగా సర్వే బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. దీంతో వారు నిత్యం ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. దీని వల్ల కార్యాలయాల్లో పనులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి.

పైరుకోత వాయిదా వేసుకోవాలి

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున కోత దశలో ఉన్న పైర్లను కోయడం వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు చెరకులో పీక పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

రాగల వర్షాన్ని వినియోగించుకుని 45 రోజుల వయసు గల కార్సి చేసిన పైరులో ఎకరాకు 150 కిలోల యూరియా వేసుకోవాలని తెలిపారు. నేలలో తేమ సమృద్ధిగా ఉన్నప్పుడే ఎరువులు వేసుకోవాలని, 90 రోజుల వయసు గల చెరకు తోటల్లో ఎకరాకు 75 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు.

గాలి, వర్ష సూచన ఉన్నందున పక్వానికి వచ్చిన పళ్లు, కూరగాయలు కోసి మార్కెట్‌కు తరలించాలని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవిలో దుక్కు దున్నుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల అవశేషాలు, కలుపు విత్తనాలు భూ ఉపరితలానికి చేరి, అవి సూర్యరశ్మి ద్వారా నిర్మూలించబడతాయని తెలిపారు. రుతుపవనాలు ఏర్పడిన వెంటనే పంట విత్తకోవడం లేదా నాటుకోడానికి అనుకూలంగా ఉంటుందన్నారు.